సంక్షిప్త వార్తలు

పాకిస్థాన్ కన్నా నరకమే నయం: జావేద్ అక్తర్

ముంబై: పాకిస్థాన్ లేదా నరకం, ఈ రెండిటిలో ఏదో ఒకదానిని ఎంచుకోవలసిన పరిస్థితి వస్తే, తాను నరకానికి వెళ్లడానికే ఇష్టపడతానని బాలీవుడ్ పాటల రచయిత, స్క్రీన్ రైటర్ జావేద్ అక్తర్ అన్నారు. శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ పుస్త కావిష్కరణ కార్యక్రమంలో శనివారం రాత్రి ఆయన మాట్లాడారు. భారత్, పాక్‌ల లోని అతివాదులు తనపై రోజూ దూషణల వర్షం కురిపిస్తారన్నారు. 'నువ్వు కాఫిర్ (అవిశ్వాసి) అని ఓ వర్గంవారు, 'జీహాదీ, పాకిస్థాన్‌కు పో' అని మరొక వర్గం వారు అంటారని, పాకిస్థాన్ లేదా నరకం, వీటిలో ఏదో ఒకదానిని ఎంచుకోవాలంటే, నేను నరకానికే ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు.

ఆపరేషన్ సిందూర్‌పై పోస్ట్.. అశోక వర్సిటీ ప్రొఫెసర్ అరెస్ట్

న్యూఢిల్లీ: అశోక విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్ముదాబాద్‌ను ఆదివారం అరెస్ట్ చేశారు. బీజేపీ యువ మోర్చా నేత ఫిర్యాదుపై ఆయనను ఢిల్లీలో అరెస్ట్ చేశారు. అలీ ఖాన్ సామాజిక మాధ్యమాల్లో ఇచ్చిన పోస్ట్‌లో, 'ఆపరేషన్ సిందూర్'పై కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ మీడియాకు వివరించడాన్ని మీడియా ఆర్భాటంగా వర్ణించారు. ఈ ఆర్భాటం క్షేత్ర స్థాయిలో వాస్తవ రూపం దాల్చాలని, లేదంటే ఇదంతా కేవలం నయవంచన అవుతుందని పేర్కొన్నారు. ఆయనకు హర్యానా మహిళా కమిషన్ కూడా నోటీసులిచ్చింది.

పాక్‌కు ఐఎంఎఫ్ షాక్.. నిధుల విడుదలకు షరతులు

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) భారీ షాక్ ఇచ్చింది. ఉద్దీపన పథకంలో భాగంగా పాక్‌కు తదుపరి విడత నిధులను విడుదల చేసేందుకు కొత్తగా మరో 11 షరతులు విధించింది. రూ.17.6 లక్షల కోట్ల కొత్త బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదాన్ని పొందాలని, ఆ బడ్జెట్‌లో రూ.1.07 లక్షల కోట్లను అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించాలని, విద్యుత్తు బిల్లులపై రుణ సేవల సర్‌చార్జీని పెంచాలని, మూడేండ్లకు మించి ఉపయోగించిన కార్ల దిగుమతిపై ఆంక్షలను ఎత్తివేయాలని తాజా షరతుల్లో స్పష్టం చేసింది.

ట్రంప్ సలహాదారుగా ఉగ్రవాది

వాషింగ్టన్ డీసీ: లష్కరే తాయిబాతో సంబంధం ఉన్న ఒక ఉగ్రవాదిని, ఎన్ ఐఏ అభియోగాలున్న మరో వ్యక్తిని అమెరికా ప్రభుత్వం తన సలహాదారులుగా నియమించుకున్నది. ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేస్తున్న ఇస్మాయిల్ రోయర్, షయేక్ హమ్జా యూసుఫ్‌ను మత స్వేచ్ఛకు సంబంధించిన కమిషన్‌లో ట్రంప్ నియమించారు. 2003లో రోయర్‌పై అమెరికాలో ఉగ్రవాద అభియోగాలతో కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు 2004లో కోర్టు 20 ఏండ్ల జైలు శిక్ష విధించింది. షయేక్ హమ్జా యూసుఫ్‌ను 'పశ్చిమ దేశాల్లో అత్యంత ప్రభావవంతమైన ఇస్లామిక్ స్కాలర్'గా పిలుస్తుంటారు. మతవిద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నాడంటూ హమ్జాపై 'నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ' (ఎన్ ఐఏ) 2016లో కేసు నమోదు చేసింది.

తుర్కియేతో ఐఐటీ-బాంబే ఒప్పందాల రద్దు

ముంబై: పాకిస్థాన్‌కు మద్దతిస్తున్న తుర్కియేపై భారతీయుల నిరసన తీవ్రమవుతున్నది. తాజాగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-బాంబే స్పందించింది. తుర్కియేలోని విశ్వవిద్యాలయాలతో చేసుకున్న అన్ని ఒప్పందాలను తదుపరి నోటీసు జారీ చేసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. దీంతో కొన్ని టర్కిష్ విద్యా సంస్థలతో ఐఐటీ-బాంబే కుదుర్చుకున్న ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ నిలిచిపోయింది. జేఎన్‌యూ, జామియా మిలియా ఇస్లామియా, ఐఐటీ-రూర్కీ కూడా తుర్కియేతో ఒప్పందాలను రద్దు చేసిన సంగతి తెలిసిందే.

కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదు: ఆర్మీ

న్యూఢిల్లీ: భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఆదివారంతో ముగిసినట్టు వచ్చిన వార్తలను భారత సైన్యం ఖండించింది. కాల్పుల విరమణకు ముగింపు తేదీ ఏదీ లేదని స్పష్టం చేసింది. ఈ నెల 12న ఇరు దేశాల మిలిటరీ ఆపరేషన్ల డైరెక్టర్ జనరల్స్ కీలక చర్చలు జరిపి వెంటనే కాల్పుల విరమణ పాటించాలని నిర్ణయించారు. సరిహద్దుల్లో భద్రతా దళాలను తగ్గించుకోవడానికి పరస్పరం అంగీకరించారు.

మన మామిడి రైతులకు అమెరికా షాక్

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): భారత్‌లోని మామిడి రైతులకు అమెరికా షాకిచ్చింది. మన దేశం నుంచి ఎగుమతి చేసిన 15 మామిడి పండ్ల షిప్‌మెంట్‌లను అమెరికాలోని వివిధ ఎయిర్‌పోర్టుల్లో అధికారులు నిలిపివేశారు. సరైన పత్రాలు లేవనే కారణం చూపుతూ వాటిని అమెరికాలోకి అనుమతించకుండా అడ్డుకున్నారు. 5 లక్షల డాలర్ల (దాదాపు రూ.4.28 కోట్ల) విలువైన ఈ పండ్లను రవాణా చార్జీలు భరించి భారత్‌కు తిరిగి తీసుకొచ్చే పరిస్థితి లేకపోవడంతో అక్కడే ధ్వంసం చేస్తున్నారు.

17 మంది ఎంపీలకు సంసద్ రత్న అవార్డులు

న్యూఢిల్లీ: సంసద్ రత్న అవార్డు 2025కు ఎంపీలు భర్తృహరి మహతాబ్, రవి కిషన్ సహా 17 మంది పార్లమెంట్ సభ్యులు, రెండు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలను ఎంపిక చేశారు. పార్లమెంట్‌కు సభ్యులు చేసిన కృషి ఆధారంగా ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ ఈ అవార్డులను అందజేస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి అత్యుత్తమ, స్థిరమైన సహకారం అందించిన మహతాబ్, సుప్రియా సూలే (ఎన్సీపీ-ఎస్పీ), ఎన్‌కే ప్రేమచంద్రన్ (ఆర్ఎస్‌పీ) శ్రీరంగ్ అప్పా బర్నేలు ఈ అవార్డులు దక్కించుకున్నారు.

ఐఐటీ అప్‌స్కిల్లింగ్ కోర్సులకు వర్కింగ్ ప్రొఫెషనల్స్ క్యూ

న్యూఢిల్లీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) వంటి ప్రముఖ సంస్థలు నిర్వహిస్తున్న ఆన్‌లైన్ అప్‌స్కిల్లింగ్ కోర్సులకు ఆదరణ పెరిగింది. వర్కింగ్ ప్రొఫెషనల్స్ ఈ కోర్సుల్లో చేరుతున్నారు. వీరిలో 70 శాతం మంది మూడేళ్లలోపు ఉద్యోగ అనుభవం కలవారు. పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో వీరు ఈ కోర్సులను నేర్చుకుంటున్నారు.

ఎన్‌సీఎస్ఎం వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్ సరోజ్ ఘోష్ మృతి

కోల్‌కతా: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్ వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్, 'పద్మ భూషణ్' సరోజ్ ఘోష్ కన్నుమూశారు. ఎన్‌సీఎస్ఎం ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం, ఆయన అమెరికాలోని సియాటెల్‌లో శనివారం తుది శ్వాస విడిచారు. 1979-1997 మధ్య కాలంలో ఎన్‌సీఎస్ఎం డీజీగా ఆయన దేశవ్యాప్తంగా సైన్స్ సెంటర్ల నెట్‌వర్క్ ఏర్పాటుకు విశేషంగా కృషి చేశారు. ఆయన కోరిక మేరకు ఆయన పార్థివ దేహాన్ని పరిశోధనల కోసం వాషింగ్టన్ విశ్వవిద్యాలయానికి విరాళంగా ఇచ్చినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

యూకే నగర మేయర్‌గా యూపీ రైతు కొడుకు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌కు చెందిన ఓ రైతు కొడుకైన రాజ్ మిశ్రా(37) యూకేలోని వెల్లింగ్‌బరో పట్టణ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఈ నెల 14న ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. నార్తంప్టన్‌షైర్‌లో మార్కెట్ టౌన్‌గా పేరున్న వెల్లింగ్‌బరోలో ఈ నెల 6న జరిగిన స్థానిక ఎన్నికల్లో రాజ్ మిశ్రా విక్టోరియా వార్డ్ నుంచి గెలుపొందారు. 'వెల్లింగ్‌బరోకు మేయర్‌గా సేవలందించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా. ఉత్సాహభరితమైన, సమ్మిళిత, సుసంపన్న సమాజాన్ని నిర్మించడం కోసం స్థానికులతో కలిసి పని చేయడానికి నేను కట్టుబడి ఉన్నా. మనమంతా కలిసి మన పట్టణానికి గొప్ప భవిష్యత్తును నిర్మించుకుందాం' అని రాజ్‌మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు.

ముజిబ్ బయోపిక్‌లో హసీనా పాత్రధారి నుస్రత్ అరెస్ట్

ఢాకా: ప్రజాదరణ పొందిన బంగ్లాదేశ్ నటి నుస్రత్ ఫరియాను ఆదివారం ఉదయం ఢాకా విమానాశ్రయంలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె భారత్-బంగ్లాదేశ్ సంయుక్తంగా నిర్మించిన ముజిబుర్ రెహ్మాన్ జీవిత గాథ చిత్రం 'ముజిబ్:ది మేకింగ్ ఆఫ్ ఎ నేషన్'లో షేక్ హసీనా పాత్రను పోషించారు. హసీనాకు వ్యతిరేకంగా ఈ సంవత్సరం జూలైలో జరిగిన విద్యార్థుల సామూహిక పోరాటం సందర్భంగా జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి ఫరియాను అరెస్ట్ చేసినట్టు తెలిసింది. ఈ కేసు విషయమై ఇప్పటికే ఆమెపై అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది. ఆమె పలు భారత(ఎక్కువగా బెంగాలీ), బంగ్లాదేశీ సినిమాల్లో నటించారు.

సీజేఐకి ఇచ్చే మర్యాద ఇదేనా?

- మహారాష్ట్ర బీజేపీ ప్రభుత్వంపై జస్టిస్ గవాయ్ అసహనం
- ప్రొటోకాల్ పాటించక పోవడంపై తీవ్ర అసంతృప్తి
- ప్రజాస్వామ్యంలో మూడు స్తంభాల మధ్య పరస్పర గౌరవం ఉండాలన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

ముంబైలోని చైత్యభూమిలో బుద్ధుడి విగ్రహానికి నమస్కరిస్తున్న సీజేఐ గవాయ్

ముంబై, మే 18: 'భారత ప్రధాన న్యాయమూర్తిని, పైగా ఈ ప్రాంత బిడ్డను. సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన తొలిసారి రాష్ట్ర పర్యటనకు వస్తే మీరిచ్చే గౌరవం ఇదేనా?' అంటూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ మహారాష్ట్ర బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో మూడు స్తంభాల మధ్య పరస్పర గౌరవం ఉండాలని హితవు పలికారు. జస్టిస్ బీఆర్ గవాయ్ ఈ నెల 14న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. గోవా బార్ అసోసియేషన్ ఆదివారం ముంబైలో ఆయనకు సన్మాన సభ ఏర్పాటు చేసింది. దీనికి హాజరయ్యేందుకు జస్టిస్ గవాయ్ ముంబైకి వచ్చారు. ప్రొటోకాల్ ప్రకారం సీజేఐకి ఆహ్వానం పలికేందుకు మహారాష్ట్ర సీఎస్‌తోపాటు, డీజీపీగానీ, ముంబై పోలీస్ కమిషనర్‌గానీ హాజరుకాలేదు. దీంతో జస్టిస్ గవాయ్ తీవ్ర అసహనానికి గురయ్యారు.

ప్రజాస్వామ్యంలోని మూడు స్తంభాలు సమానమే..

సన్మాన సభలో ప్రొటోకాల్ విషయంపై జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ.. 'నేను ఇలాంటి చిన్న చిన్న విషయాలను ఎత్తిచూపాలని అనుకోవడం లేదు. కానీ ఇది ఒక వ్యవస్థ మరో వ్యవస్థ ఇచ్చే గౌరవానికి సంబంధించిన అంశం' అని పేర్కొన్నారు. 'ప్రజాస్వామ్యంలోని మూడు స్తంభాలు (శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ) సమానమే. ప్రతి రాజ్యాంగ వ్యవస్థ ఇతర వ్యవస్థల పట్ల పరస్పరం గౌరవం చూపాలి' అని సూచించారు. 'మహారాష్ట్ర బిడ్డ భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేసి, తొలిసారి ఇక్కడికి వచ్చినప్పుడు ఆహ్వానం పలికేందుకు సీఎస్, డీజీపీ లేదా ముంబై పోలీస్ కమిషనర్ రాకపోవడం సరైనదా? కాదా? అనేది వారికే వదిలేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. 'ఒక వ్యవస్థకు చెందిన అధిపతి తొలిసారి రాష్ట్రానికి వచ్చినప్పుడు ఇలా వ్యవహరించడం సబబేనా? అనేది వారే ఆలోచించుకోవాలి' అని అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంలో మరింత లోతుకు వెళ్లదలుచుకోలేదని, కానీ విషయం తెలియాలని చెప్తున్నానన్నారు. ఒక వేళ తన స్థానంలో మరొకరు ఉండి ఉంటే ఆర్టికల్ 142ను పరిగణనలోకి తీసుకునేవారని సున్నితంగా హెచ్చరించారు. ఆర్టికల్ 142 అనేది సుప్రీంకోర్టు ఏ అంశంలో అయినా, ఏ కేసులో అయినా సొంతంగా ఆదేశాలు జారీ చేసే అధికారాన్ని కల్పిస్తుంది. అంతేకాదు.. ఏ వ్యక్తి అయినా కోర్టు మందు హాజరయ్యేలా ఆదేశాలు జారీ చేయగలదు. సీజేఐ వ్యాఖ్యలతో మహారాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. సన్మానం అనంతరం జస్టిస్ గవాయి అంబేద్కర్ ఘాట్ 'చైతన్య భూమి'ని సందర్శించారు. ఈ కార్యక్రమానికి సీఎస్ సుజాతా సౌనిక్, డీజీపీ రశ్మీ శుక్లా, ముంబై పోలీస్ కమిషనర్ దేవన్ భార్తీ హాజరయ్యారు.

ఇప్పటికే రెండు వ్యవస్థల మధ్య సంఘర్షణ

సుప్రీంకోర్టు, రాష్ట్రపతి మధ్య ప్రస్తుతం సంఘర్షణ వాతావరణం కొనసాగుతున్నది. న్యాయ వ్యవస్థ, శాసన వ్యవస్థల అధికారాలు, పరిమితులపై తీవ్ర చర్చ కొనసాగుతున్నది. ఇలాంటి సమయంలోనే మహారాష్ట్రలో కార్యనిర్వాహక వ్యవస్థ సైతం వివాదంలో తలదూర్చిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. తమిళనాడు శాసన సభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఆమోదించకపోవడంపై గత నెలలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి/గవర్నర్ మూడు నెలల్లోగా ఆమోదించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆర్టికల్ 142 ప్రకారం ఈ ఆదేశాలు జారీ చేస్తున్నట్టు చెప్పింది. వెనక్కి పంపితే కారణాలు చెప్పాల్సి ఉంటుందని తెలిపింది. ఈ తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమీక్ష చేసి రాష్ట్రపతికి, గవర్నర్లకు కోర్టులు ఎలా గడువు నిర్దేశిస్తాయో తెలపాలని సుప్రీంకోర్టుని కోరారు. ఆదేశాలు ఇచ్చే అధికారం ఉన్నదో లేదో తెలపాలని సీజేఐకి లేఖ రాశారు.

జమ్ముకశ్మీర్‌లో తెలంగాణ జవాన్ ఆత్మహత్య!

తుపాకితో కాల్చుకుని మృతి

సాంబా/జమ్ము: తెలంగాణకు చెందిన ఓ జవాన్ ఆదివారం జమ్ముకశ్మీర్‌లోని సాంబా జిల్లాలో తన సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతర్జాతీయ సరిహద్దుకు సమీపంలోని సరోజ్ ఔట్‌పోస్టు వద్ద సెంట్రీ విధులు నిర్వహిస్తుండగా ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్టు అధికారులు వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తును బట్టి అతడు ఆత్మహత్యకు పాల్పడినట్టు అధికారులు తెలిపారు. అయితే అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని చెప్పారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల్లో చక్కెర వినియోగాన్ని తగ్గించండి

- బడుల్లో షుగర్ బోర్డులు ఏర్పాటుచేయండి
- అనుబంధ పాఠశాలలకు సీబీఎస్ఈ సూచన

న్యూఢిల్లీ: అధిక చక్కెర వినియోగాన్ని తగ్గించడంపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు బడుల్లో చక్కెర (షుగర్) బోర్డులు ఏర్పాటు చేయాలని సీబీఎస్ఈ తన అనుబంధ పాఠశాలలను కోరింది. ఇటీవల కాలంలో పిల్లల్లో సైతం టైప్ 2 మధుమేహం పెరుగుతున్న నేపథ్యంలో ఈ చర్యను చేపట్టింది. చక్కెర అధికంగా తినడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై తన అనుబంధ స్కూళ్లకు రాసిన లేఖలో ఆందోళన వ్యక్తం చేసింది. పంచదార కలిగిన చిరు తిండ్లు, పానీయాలు, ప్యాక్ చేసిన ఆహారం స్కూళ్ల ప్రాంగణాల్లో సులువుగా దొరకడం వల్లే బాలబాలికల్లో మధుమేహం కేసులు పెరుగుతున్నాయని తెలిపింది. దీని వల్ల ఊబకాయం, దంత సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలనూ వారు ఎదుర్కొంటున్నారని చెప్పింది. బడుల్లో ఏర్పాటు చేసే షుగర్ బోర్డుల్లో రోజువారీ తీసుకోవాల్సిన పంచదార పరిమితి, జంక్ ఫుడ్, సాఫ్ట్ డ్రింక్స్‌లో ఉండే చక్కెర స్థాయిలు, చక్కెర వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను ప్రదర్శించాలని పేర్కొంది.

సుప్రీంను రాష్ట్రపతి ప్రశ్నించడాన్ని వ్యతిరేకించండి: స్టాలిన్

చెన్నై: బిల్లుల ఆమోదం విషయంలో తనకు, గవర్నర్లకు గడువు విధించడంపై సుప్రీంకోర్టుకు ప్రశ్నలు సంధిస్తూ రాష్ట్రపతి న్యాయ సలహా కోరడాన్ని వ్యతిరేకించాలని బీజేపీయేతర రాష్ట్రాల సీఎంలను తమిళనాడు సీఎం స్టాలిన్ కోరారు. దీనిపై సమన్వయ, వ్యూహాత్మక న్యాయపోరాటం సాగించాలని 8 రాష్ట్రాల సీఎంలకు లేఖ రాశారు. తమ రాష్ట్ర గవర్నర్ బిల్లుల ఆమోదంపై జాప్యం చేసిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు రాజ్యాంగ నైతికతతో వ్యవహరించాలన్నారు. ఈ తీర్పును అస్థిరపరచడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని, ఇందులో భాగంగానే రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టుకు ప్రశ్నలు సంధించిందన్నారు.

కక్ష్యలోకి చేరని ఈవోఎస్-9

నింగిలోకి వెళ్లిన తర్వాత పీఎస్ఎల్వీలో సాంకేతిక సమస్య

శ్రీహరికోట, మే 18: అంతరిక్ష రంగంలో వరుస విజయాలతో అప్రతిహతంగా దూసుకుపోతున్న ఇస్రోకు ఎదురుదెబ్బ తగిలింది. ఆదివారం ఏపీలోని శ్రీహరికోట నుంచి ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ61 ప్రయోగంలో సాంకేతిక సమస్య తలెత్తింది. ఆదివారం ఉదయం 5:59 గంటలకు పీఎస్ఎల్వీ-సీ 61 మిషన్‌ను ప్రయోగించింది. అయితే ప్రయోగం మొదలైన కొద్దిసేపటికే రాకెట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీనిపై ఇస్రో చైర్మన్ నారాయణ మాట్లాడుతూ.. మూడో స్టేజీలో సాంకేతిక సమస్య తలెత్తినట్టు చెప్పారు. దీంతో ప్రయోగం పూర్తి కాలేదన్నారు. విశ్లేషించిన అనంతరం పూర్తి సమాచారం ఇస్తామన్నారు. ఇస్రోకు ఇది 101వ మిషన్. ఈ ప్రయోగం ద్వారా ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టాలని ఇస్రో భావించింది. 2022లో ప్రయోగించిన ఈవోఎస్-04 ఉపగ్రహానికి ప్రత్యామ్నాయంగా దీనిని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. పీఎస్ఎల్వీని అత్యంత విజయవంతమైన రాకెట్‌గా పిలుస్తుంటారు. ఇప్పటివరకు 63సార్లు ప్రయోగించగా కేవలం మూడుసార్లు మాత్రమే విఫలం అయినట్టు ఇస్రో వర్గాలు చెప్పాయి. గతంలో 1993లో, 2017లో పీఎస్ఎల్వీ విఫలం అయ్యింది. పీఎస్ఎల్‌వీ 61 రాకెట్ విఫలంపై దర్యాప్తు చేసేందుకు ఒక కమిటీని వేసినట్టు ఇస్రో చైర్మన్ తెలిపారు.

గ్రేటర్ బంగ్లాదేశ్ మ్యాప్‌లో భారత రాష్ట్రాలు!

రూపొందించిన ఇస్లామిస్ట్ గ్రూప్

ఢాకా: ఢాకాలో టర్కిష్ ఎన్జీవో మద్దతు ఉన్న ఒక ఇస్లామిస్ట్ గ్రూప్ వివాదాస్పద గ్రేటర్ బంగ్లాదేశ్ మ్యాప్‌ను ప్రదర్శించింది. అందులో భారత్‌కు చెందిన పలు తూర్పు, ఈశాన్య రాష్ట్రాలు తమ దేశంలో భాగమేనని ప్రకటించింది. ఎకనామిక్స్ టైమ్స్ కథనం ప్రకారం సల్తానత్-ఎ-బంగ్లా అనే గ్రూప్ ఈ గ్రేటర్ బంగ్లాదేశ్ మ్యాప్‌ను విడుదల చేసింది. ఈ మ్యాప్‌లో మయన్మార్‌లోని అరకాన్ రాష్ట్రం, భారత్‌కు చెందిన బీహార్, జార్ఖండ్, ఒడిశాతో పాటు యావత్ ఈశాన్య రాష్ట్రాలు గ్రేటర్ బంగ్లాదేశ్‌లో భాగంగా చూపించారు. ఢాకాలోని పలు యూనివర్సిటీ హాళ్లలో, విద్యార్థులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ మ్యాప్ దర్శనమిస్తున్నది.

గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

- 103 మంది మృతి.. వందల మందికి గాయాలు
- ఉత్తర గాజాలో అన్ని ప్రభుత్వ దవాఖానల్లో నిలిచిన సేవలు

ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన ఉత్తర గాజా సరిహద్దుల్లోని భవనాలు

గాజాస్ట్రిప్: గాజాపై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు గాజాస్ట్రిప్‌పై జరిపిన వైమానిక దాడుల్లో 103 మంది మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. ఖాన్ యూనిస్ నగరంలోనే 48 మందికిపైగా మరణించారని నసీర్ దవాఖాన వెల్లడించింది. వీరిలో 18 మంది చిన్నారులు, 13 మంది మహిళలు ఉన్నట్టు తెలిపింది. జబలియా శరణార్థి శిబిరంపై జరిపిన దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 9 మంది ప్రాణాలు కోల్పోయినట్టు గాజా వైద్య శాఖ వెల్లడించింది. జబలియాలోనే మరో నివాస భవనంపై జరిపిన దాడిలో 10 మంది మృతిచెందినట్టు పేర్కొంది. ఇజ్రాయెల్ బాంబు దాడుల నేపథ్యంలో ఉత్తర గాజాలో పనిచేస్తున్న ఏకైక ప్రధాన దవాఖానను మూసివేశారు. దీంతో ఉత్తర గాజాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో సేవలు నిలిచిపోయాయని గాజా వైద్య శాఖ తెలిపింది. దీనిపై ఇజ్రాయెల్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఇకపై గాజాలో విస్తృతంగా గ్రౌండ్ ఆపరేషన్

మిగిలిన బందీలను విడుదల చేసేలా హమాస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు గాజాలో విస్తృత గ్రౌండ్ ఆపరేషన్‌ను ప్రారంభించినట్టు ఇజ్రాయెల్ ఆర్మీ ఆదివారం ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్‌కు వెళ్లకుండానే మధ్యప్రాచ్య పర్యటనను ముగించిన నేపథ్యంలో ఇజ్రాయెల్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురైనప్పటి నుంచి గాజాలో 3 వేల మందికిపైగా మరణించారు.

హమాస్ నేత మహమ్మద్ సిన్వార్ మృతి?

గాజాపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హమాస్ మాజీ నేత యహ్యా సిన్వార్ సోదరుడు మహమ్మద్ సిన్వార్ మృతి చెందాడు. ఖాన్ యూనిస్‌లోని ఒక గుహలో అతని మృతదేహం లభ్యమైనట్టు స్థానిక వార్తా కథనాలు వెల్లడించాయి.

పాక్‌లో లష్కరే అగ్రనేత హతం

- సైపుల్లాను కాల్చి చంపిన గుర్తు తెలియని వ్యక్తులు
- భారత్‌లో మూడు ప్రధాన ఉగ్రదాడులకు సూత్రధారి

న్యూఢిల్లీ: భారత్‌లో మూడు ప్రధాన ఉగ్రదాడులకు సూత్రధారి, లష్కరే అగ్ర నేత సైపుల్లా ఖలీద్ పాక్‌లోని సింధు ప్రావిన్స్‌లో హతమయ్యాడు. గుర్తు తెలియని దుండగులు అతనిపై దాడి చేసి హతమార్చారు. నాగ్‌పూర్, రాంపూర్, బెంగళూరుల్లో జరిగిన మూడు ప్రధాన ఉగ్ర దాడుల ప్రణాళిక కర్త సైపుల్లా ఖలీదే. 2001లో రాంపూర్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై, 2005లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌పై, 2006లో నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్‌పై దాడులకు ఇతనే ప్రధాన కుట్రదారుడు. ఐదేండ్ల వ్యవధిలో మూడు ప్రధాన దాడుల ద్వారా ఎల్ఈటీ కార్యకలాపాలను భారత్‌లో భారీగా విస్తరించాడు.

'పాక్ గూఢచారి' జ్యోతితో ఒడిశా యూట్యూబర్‌కు లింకులు?

పూరి: గూఢచర్యం కేసులో అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతో ఒడిశాలోని పూరిలో ఉన్న ఓ యూట్యూబర్‌కు సంబంధాలున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూరి ఎస్‌పీ వినీత్ కథనం ప్రకారం, 'ట్రావెల్ విత్ జో' యూట్యూబ్ చానల్‌ను నడుపుతున్న జ్యోతి నిరుడు సెప్టెంబరులో పూరి వచ్చి, ఓ మహిళా యూట్యూబర్‌ను కలిసింది. పూరి మహిళ కూడా పాకిస్థానీ నిఘా వర్గాలకు మన దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని ఇచ్చిందా? అనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జ్యోతిని పాక్ ఐఎస్ఐ ఏజెంట్లు ఒక అస్త్రంగా మలచుకున్నారని హర్యానా పోలీసులు గుర్తించారు.

అమెరికాలో టోర్నడో బీభత్సం

27 మంది మృతి

లండన్, మే 18: అమెరికాలోని కెంటకీ, మిస్సోరి రాష్ట్రాల్లో టోర్నడో బీభత్సం సృష్టించింది. అమెరికా మిడ్ వెస్ట్, దక్షిణ ప్రాంతాల్లో ఈ పెను తుఫాన్ కారణంగా 27 మంది మరణించారు. ఒక్క కెంటకీలోనే 18 మంది మరణించగా, 10 మంది తీవ్రంగా గాయపడినట్టు గవర్నర్ ఆండీ బెషీర్ వెల్లడించారు. పెను తుఫాన్ తాకిడికి వందలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. అనేక వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలు వృక్షాలు నేలకూలాయి. వందలాది మంది పౌరులు నిరాశ్రయులయ్యారు. లారెల్ కౌంటీలో 17 మంది, పులస్కీ కౌంటీలో ఒకరు మరణించారని బెషీర్ వివరించారు. మరణాల సంఖ్య ఇంకా పెరగవచ్చునని చెప్పారు. తీవ్ర టోర్నడో కారణంగా రెండు డజన్లకు పైగా రోడ్లను మూసివేశారు. కాగా, మిస్సోరిలో ఐదుగురు మరణించగా, 38 మంది గాయపడ్డారని, 5 వేలకు పైగా ఇండ్లపై తుఫాన్ ప్రభావం చూపిందని మేయర్ కారా స్పెన్సర్ చెప్పారు. కాగా, అమెరికా అధ్యక్షుడు ట్ర